క్లుప్తంగా

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి



గొల్లలకోడేరులో సిద్ధం చేసిన కౌంటింగ్ కేంద్రం

పాలకోడేరు: పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి పరిశీలించారు. ఓట్ల లెక్కింపులో పొరపాట్లకు తావులేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపులో ఒకటికి, రెండు సార్లు పరిశీలించుకోవడంతో పాటు, పోటీలో ఉన్న అభ్యర్థుల అభ్యర్థనలను పరిగణలోనికి తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

అమ్మవారికి పట్టుచీరల అలంకరణ



కనకదుర్గమ్మ

కాళ్ల: కాళ్ల మండలం కోమటిగుంట గ్రామంలో కొలువై ఉన్న విజయకనకదుర్గమ్మ వారు పట్టుచీరలతో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా కోదండరామాలయం కమిటీ, దాతల సాయంతో అమ్మవారిని సుమారు 150 పట్టుచీరలతో అలంకరించారు. తొలుత ఆలయంలో ఉన్న అమ్మవారి పంచలోహ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



వృద్ధులకు పండ్లు పంచుతున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భీమవరం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేరురోడ్‌లోని జడ్డు బ్రహ్మాజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు గోపిశెట్టి మురళీ కృష్ణారావు, అధ్యక్ష, కార్యదర్శులు టంకాల శ్రీకాంత్, కె.సత్య, కె.కృష్ణ, జడ్డు ప్రసాద్, జె.నాగు, పి.అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు మత్స్యపురి వార్డు సభ్యుడి ఎన్నిక

వీరవాసరం: మత్స్యపురి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల ఎన్నిక ప్రశాంత వాతావరణంలో, శాంతియుతంగా నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ కె.జ్యోతి తెలిపారు. వీరవాసరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి పోలింగ్ సామగ్రిని శుక్రవారం మత్స్యపురి తరలించారు. మూడో వార్డుకు పోలింగ్ ప్రక్రియ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం రెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

వాండ్రంలో ఉద్రిక్తత

ఉండి: మండలంలోని వాండ్రం గ్రామంలో యువకుల మధ్య తలెత్తిన చిన్న వివాదం ఉద్రిక్తతలకు దారి తీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం గ్రామంలో వారాల పండుగ నేపథ్యంలో రెండు వర్గాల యువకుల మధ్య తలెత్తిన ఓ చిన్న వివాదం కొట్లాటకు దారి తీసింది. అయితే శుక్రవారం గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరించుకునేందుకు ఇరుపక్షాల పెద్దలు ప్రయతిస్తుండగా ఆదే యువకుల మధ్య మరోసారి కొట్లాట జరగడంతో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో గ్రామంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు శుక్రవారం రాత్రి వాండ్రం చేరుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. పోలీసులు రంగ ప్రవేశంతో గ్రామంలో కొంత ప్రశాంతత నెలకొంది. ఎలాంటి గొడవలు జరుగకుండా ఉండేందుకు గ్రామంలో ఉండి ఎస్సై కె.గంగాధరరావు, కాళ్ల ఎస్సై మూర్తి తమ సిబ్బందితోనూ, స్పెషల్ పార్టీ పోలీలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని సాధారణ సమాచారం మేరకు ముందు జాగ్రత్తగా పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులతో వాండ్రంలో బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీసులు పేర్కొంటున్నారు.

నేడు 'చరిత్ర మరిచిన చిత్తరువు' పుస్తకావిష్కరణ

నరసాపురం రూరల్: దివంగత మాజీ ఎమ్మెల్యే, కామ్రేడ్ పడాల శ్యామసుందరరావు జీవిత చరిత్రకు సంబంధించి రచించిన 'చరిత్ర మరిచిన చిత్తరువు' పుస్తకావిష్కరణ సభ శనివారం సాయంత్రం 3 గంటలకు నరసాపురంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎట్టకేలకు వంతెనలకు మోక్షం

- 3 వంతెనల అప్రోచ్‌లకు రూ.36 కోట్లు మంజూరు
- 16 గ్రామాలతో పాటు పట్టణానికి తీరనున్న ట్రాఫిక్ సమస్య



గొల్లవానితిప్ప వద్ద బ్రిడ్జికి అప్రోచ్‌లు నిర్మించేందుకు పిచ్చిమొక్కలను తొలగిస్తున్న జేసీబీ

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన మూడు వంతెనలకు మోక్షం లభించనుంది. వీటి అప్రోచ్‌ల నిర్మాణానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వంతో రూ.36 కోట్లు మంజూరు చేయించారు. ఇటీవల టెక్నికల్ అధికారులు వంతెనల అప్రోచ్‌ల డిజైన్ల కొలతలు తీసుకొన్నారు. నాగేంద్రపురం – తోకతిప్ప, గొల్లవానితిప్ప – రామాయణపురం, రెస్ట్‌హౌస్ రోడ్ గంగానమ్మ గుడి వద్ద – కాల్వ గట్టు గొల్లవానితిప్ప రోడ్ వద్ద యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనల వద్ద తుప్పలు, పిచ్చిచెట్లను జేసీబీ సాయంతో తొలగిస్తున్నారు. ఈ అప్రోచ్‌ల నిర్మాణం పూర్తయితే డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న 16 గ్రామాలతో పాటు మొగల్తూరు, నరసాపురం మండలాలకు ప్రయోజనం, భీమవరం పట్టణంలోని ట్రాఫిక్ సమస్య తీరనుంది. భారీ వాహనాలు, స్కూల్ బస్సులు, వాహనాలు పట్టణంలోకి రాకుండా రెస్ట్‌హౌస్ రోడ్డు వంతెన మార్గం నుంచి 216ఎ జాతీయ రహదారికి, ఇవతలి వాహనాలు కాళీపట్నం మీదుగా నరసాపురం, కోనసీమ అంబేడ్కర్ జిల్లాలకు వాహనాలు మరలడంతో ట్రాఫిక్ సమస్య తీరనుంది.

తీరనున్న కష్టాలు

యనమదుర్రు డ్రెయిన్ ఆనుకుని ఇరువైపులా ఉన్న ప్రజలు డ్రెయిన్ అవతలి వైపునకు వెళ్లాలంటే భీమవరం మీదుగా 20 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో ప్రజల కష్టాలను 2004లో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి విన్నవించారు. డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ బ్రిడ్జీల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు వంతెనలు నిర్మించి అప్రోచ్‌ల నిర్మాణాన్ని గాలికి వదిలేశాయి. ఆ ప్రభుత్వాల తీవ్ర అసంతృప్తితో ఉన్న ప్రజలు 2019లో గ్రంధి శ్రీనివాస్‌కు పట్టం గట్టారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ అప్రోచ్‌ల నిర్మాణంపై ప్రత్యేక చొరవ చూపి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి రూ.36 కోట్లు మంజూరు చేయించారు.

హర్షణీయం



దిరుసుమర్రు, యనమదుర్రు గ్రామాల్లో రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్‌లు ఉండటంతో ఆటోల్లో కూలీలు ఈ వంతెనల మీదుగా వచ్చి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ డ్రెయిన్‌పై వంతెనలు నిర్మాణానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అనుమతులు తీసుకొచ్చారు. మళ్లీ ఆయనే అప్రోచ్‌ల నిర్మాణానికి పూనుకోవడం హర్షణీయం. – కోళ్ల బాలకృష్ణ, సర్పంచ్, దిరుసుమర్రు

ఎమ్మెల్యే శ్రీనివాస్ వల్లే సాధ్యం



డేగాపురం – యనమదుర్రు గ్రామాల వద్ద డ్రెయిన్‌పై వంతెన మంజూరైతే దాన్ని టీడీపీ ప్రభుత్వంలో రద్దు చేశారు. అప్రోచ్‌లు కూడా నిర్మించలేదు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రెండోసారి అధికారం చేపట్టగానే బ్రిడ్జిలపై ప్రత్యేక చొరవ చూపి భారీ ఖర్చుతో కూడిన అప్రోచ్‌లకు రూ.36 కోట్లు మంజూరు చేయించారు. ఎమ్మెల్యేగా శ్రీనివాస్ రావడం మన అదృష్టం – తిరుమాని ఏడుకొండలు, ఏఎంసీ మాజీ చైర్మన్, కొత్తపూసలమర్రు

తాగునీటి సరఫరాపై ప్రత్యేక నిఘా

ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: భీమవరం శివారు ప్రాంతాలకు సైతం మంచినీరు సరఫరా చేసేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఓహెచ్‌ఆర్‌లు పూర్తిస్థాయిలో నింపుతున్నదీలేనిదీ తెలుసుకోడానికి ఓహెచ్‌ఆర్ లోపల సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మంచినీటి సరఫరాకు సంబంధించి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని శివారు ప్రాంతాలకు కొన్నిచోట్ల తాగునీరు అందడం లేదనే ఫిర్యాదులు వస్తున్నట్టు చెప్పారు. పంపింగ్ విధానంలో ఉన్న కొన్ని లోపాల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. వర్షాకాలంలో సైతం తాగునీటి ఇబ్బంది ఉన్న శివారు ప్రాంతాలకూ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. పట్టణంలో అమృత పథకంలో నిర్మిస్తోన్న రిజర్వాయర్లను మరో రెండు నెలల్లో వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. 39వ, 4వ వార్డుల్లో నిర్మించిన రిజర్వాయర్లకు త్వరలో ట్రయల్ రన్ నిర్వహిస్తామని చెప్పారు. తాగునీటి సరఫరాపై తాను, మున్సిపల్ ఎంఈ నిత్యం పర్యవేక్షణ చేస్తామని ఎమ్మెల్యే శ్రీనివాస్ చెప్పారు.



ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన దళిత సంఘం నాయకులు

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీనివాస్ అన్నారు. భీమవరం నియోజకవర్గంలో దళిత, దళిత క్రైస్తవుల నివాసిత ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పట్ల సంతృప్తితో శుక్రవారం దళిత ఐక్యవేదిక నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్ల పాలనలో భీమవరం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేశామని, కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తోన్న ఘనత జగన్‌కే దక్కుతుందని చెప్పారు. ప్రధానంగా దళితవాడల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం భీమవరం, వీరవాసరం మండలాలకు మంజూరయిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో రూ.1.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన వారిలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, పాలపర్తి జోనా, పట్టెం సుభాకర్, ఆలమూరి బాబ్జి, ఏలేటి సునీల్ కుమార్, ఆచంట ఆనంద్ కుమార్ తదితరులున్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం



విద్యార్థిని స్రవంతికి నగదు బహుమతి అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఉండి: స్థానిక జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 2022–23 ఏడాది పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన కొక్కిరిగడ్డ స్రవంతికి గుర్తి ఈశ్వరి ట్రస్ట్ తరపున రూ.10 వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు పెనుమాక భానుమూర్తి, తంగెళ్ల పద్మారావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తమ ట్రస్ట్ ద్వారా 28 జెడ్పీ పాఠశాలల్లో టెన్త్ ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున అందజేసి ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. స్రవంతి ఉన్నత స్థాయికి చేరుకోవాలని హెచ్‌ఎం వై.రాజమలక్ష్మి, ట్రస్ట్ ప్రతినిధులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆవు మృతికి కారణమైన వాహనం గుర్తింపు

ఆకివీడు: అమానుషంగా ఓ ఆవును ఢీకొట్టి దాని మృతికి కారణమైన వాహనాన్ని నెల రోజుల తరువాత పోలీసులు గురువారం అర్ధరాత్రి గుర్తించారు. గత నెల 18న స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని వివిధ వార్తాపత్రికలు వెలుగులోకి తీసుకురావడంతో భీమవరంలోని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుమోటోగా కేసు నమోదు చేసి, వాహనాన్ని గుర్తించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. దీంతో పోలీసులు సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి, వాహనాల్ని తనిఖీ చేస్తుండగా గురువారం అర్ధరాత్రి సమయంలో పాల వ్యాన్‌ను గుర్తించారు. ఈ మేరకు వాహన యజమాని, డ్రైవర్‌కు నోటీసులు జారీ చేస్తామని ఎస్సై సత్యసాయి విలేకరులకు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న చీఫ్‌విప్ ముదునూరి

నరసాపురం రూరల్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం నరసాపురం పట్టణంలోని రెండో వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రసాదరాజు పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులు, డ్రెయినేజీ, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, తదితర సమస్యలపై ప్రజలు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని, అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాల లబ్ధి పొందని వారిని గుర్తించి వారికి కూడా లబ్ధి చేకూర్చాలని సూచించారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో లోటుపాట్లు లేకుండా సరి చేసుకుని మెరుగైన సేవలు ప్రజలకు అందించాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలన సులభతరం చేశామని, ప్రజల గడప వద్దకే ప్రభుత్వాన్ని తీసుకు వచ్చామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, రెడ్డప్ప దవేజీ,మల్లాడి బుజ్జి, శేఖర్, చాగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో భక్తుల రద్దీ



దుంపగడపలో జలాభిషేకం కోసం మహిళలు బిందెలతో నీరు తీసుకెళ్తున్న దృశ్యం

ఆకివీడు: శ్రావణ మాసం పవిత్రమైన శుక్రవారం రోజే ప్రారంభం కావడంతో అమ్మవార్ల దేవాలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవార్ల దర్శనానికి క్యూకట్టారు. శ్రావణ శోభాయమానంగా పలు ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వనువులమ్మవారి ఆలయం, గంగానమ్మ, మారెమ్మ, మాదివాడలోని మద్దిరావమ్మ, గంగానమ్మ, నూకాలమ్మ, దండు మారెమ్మ, దానేశ్వరి అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలుతో శోభాయమానంగా మారాయి.

దుంపగడపలో జలాభిషేకం

మండలంలోని దుంపగడప గ్రామంలో ఉన్న భూలక్ష్మమ్మ, మారెమ్మ, వెంకమ్మ అమ్మవార్ల వార్షికోత్సవం సందర్భంగా మహిళలు జలాభిషేకం చేశారు. మంచినీటి చెరువులోని నీటిని బిందెలతో ప్రదర్శనగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారి వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్నారు.



గుమ్ములూరు రోడ్డులోని దానేశ్వరి

'గడపగడపకు'తో సమస్యల పరిష్కారం

ఆకివీడు: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన కొన్ని సమస్యలు తక్షణం పరిష్కరించడంతో ప్రజలు సంతోషిస్తున్నారు. ఈ నెల 16న స్థానిక సచివాలయం 3లోని 1వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాదివాడ దళిత పేట ప్రధాన రహదారిలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, ప్రమాదకరంగా ఉన్నాయని ఆ ప్రాంత ప్రజలు పీవీఎల్ నర్సింహరాజు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన విద్యుత్ శాఖఏఈ తో మాట్లాడి విద్యుత్‌స్తంభం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన శుక్రవారం ఆ ప్రాంతంలో విద్యుత్‌స్తంభం నెలకొల్పి వేలాడుతున్న విద్యుత్ తీగల్ని ఎత్తు పెంచారు. దీంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం తొలగింది.



రజక చెరువు సమీపంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

దళితులకు అండగా ప్రభుత్వం



గోపిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ దళిత నాయకులు

యలమంచిలి: జగనన్న ప్రభుత్వం ఎల్లప్పుడూ దళితులకు పూర్తి అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. యలమంచిలి సెంటర్లోని తమ్మినీడి ఉమా నరసింహ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి వైఎస్సార్ సీపీ దళిత సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళితులకు ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అందించడానికి కృషి చేయడంతోపాటు స్థానిక సంస్థల పాలనలోను దళితులకు తగు ప్రాధాన్యత ఇస్తానని గోపి హామీనిచ్చారు. ఈ సందర్భంగా దళిత నాయకులంతా గోపీని శాలువా, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఉచ్చుల స్టాలిన్, జవదాల సువర్ణ రాజు, మోకా నరసింహారావు, బొంతు వెంకట కర్ణారెడ్డి, విప్పర్తి నవీన్, మేడిది విజయ జ్ఞానమణి, దంగేటి రాజమణి, నల్లి సంధ్యారాణి, మానుకొండ సోమరాజు, లంక చిరంజీవి, మంద హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఇద్దరి అరెస్ట్

కాళ్ల: మండలంలోని సీసలిలో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. గ్రామంలో గుత్తుల కోటేశ్వరరావు, నెలపర్తి సుబ్బారావులు పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు కాళ్ళ ఎస్సై ఎజీఎస్ మూర్తి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారివద్దనుండి రూ.20,890 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారుల చదువుకు అండ

పెనుగొండ: తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల చదువుకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు బాసటగా నిలిచారు. అయోధ్యలంక ఎస్సీ కాలనీలో బొంతు వెర్రమ్మ కుమారుడు చిట్టిబాబు, వరలక్ష్మిలు చనిపోవడంతో కనీసం కుటుంబం గడవలేని స్థితిలో మనుమలు ప్రణీయ సతీష్ కుమార్‌తో జీవనం సాగిస్తుంది. స్థానిక నాయకులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు సమస్యను విన్నవించుకోవడంతో వారికి అండగా నిలిచి వారికి చదువుకు, భోజనానికి అవసరమైన సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి కృష్ణవేణి, ఎంపీటీసీ కంచుస్తంభం శ్రీను, గొల్లపల్లి బాలకృష్ణ, ఎం.సత్యనారాయణ, సరిళ్ల రాజు, తరపట్ల శ్రీరామమూర్తి, డాక్టర్ సత్యనారాయణ, బి.దాసు, జగన్నాధం సతీష్ పాల్గొన్నారు.